క్లుప్తంగా

పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

సీతమ్మధార: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, అధికారులంతా సమన్వయంగా వ్యవహరించి, పటిష్ట చర్యలు తీసుకోవాలని తూర్పు నియోజకవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో ఎంసీసీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీవీటీ బృందాల నోడల్ అధికారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. వివిధ అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. తనిఖీలు విస్తృతంగా నిర్వహించాలని, అన్ని కార్యకలాపాలపై నిఘా ఉంచాలని సూచించారు. జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



యువకుడి మృతదేహం

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఓ యువకుడు మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆశీలమెట్ట ఆర్టీసీ కాంప్లెక్స్ దరి 30–35 ఏళ్ల లోపు యువకుడు మృతి చెందినట్లు సమాచారంతో ద్వారకా ఎస్ఐ శ్రీను, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చేతిపై అమ్మ, నాన్నా పచ్చబొట్టు రాసి ఉంది. టీషర్ట్‌పై శ్రీలక్ష్మీగణపతి యూత్ అని తెలుగులో ఉంది. మృతదేహన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎస్ఐ సెల్ నంబర్ 83310 41588కు సమాచారం ఇవ్వాలని కోరారు.

టెన్త్ ఫలితాల్లో 'నారాయణ' సత్తా



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో నారాయణ స్కూల్ యాజమాన్యం

సీతమ్మధార: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో విశాఖపట్నం నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. షేక్ ఫరీదా 596/600 మార్కులు, ఎస్.తనుశ్రీ 592 మార్కులు, కె.చందన 590 మార్కులు సాధించి సత్తా చాటారు. 28 మందికి 580పైగా మార్కులు వచ్చాయి. నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఏజీఎం రాజ్‌కుమార్ విద్యార్థులను అభినందించారు. ఆశీలమెట్టలోని నారాయణ స్కూల్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి 372 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. ప్రతి ఒక్కరూ సగటున 511 మార్కులు సాధించారని తెలిపారు.

హరగోపాల్ స్కూల్ ప్రతిభ




ఇ.ప్రవల్లిక | జి.నిఖిత

తాటిచెట్లపాలెం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రైల్వే న్యూకాలనీలోని హరగోపాల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 101 మంది పరీక్షలు రాయగా.. అందరూ పాస్ అయ్యారని ప్రిన్సిపాల్ శంకరరావు నాయుడు తెలిపారు. వీరిలో 30 మంది 550కి, 60మంది 500కి పైగా మార్కులు సాధించి ప్రతిభ చూపారని చెప్పారు. ఇ.ప్రవల్లిక 592 మార్కులతో అత్యధిక మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందన్నారు. జి.నిఖిత 588, కె.వంశీ 587 మార్కులతో రెండు, మూడు స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ పిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

మెరిసిన బీవీకే విద్యార్థులు




తరుణ్ తేజ | సీతా మహాలక్ష్మి

విశాఖ విద్య: భారతీయ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించారని విద్యా సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు, సెక్రటరీ సత్యనారాయణ తెలిపారు. తరుణ్ తేజ, అంబటి చంద్రిక సీతామహాలక్ష్మి 587 మార్కులు సాధించి విద్యా సంస్థల పరిధిలో టాప్‌గా నిలిచారన్నారు. 208 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో పాస్ అయ్యారని, 500 మార్కులకు పైగా 97 మంది విద్యార్థులు సాధించారని చెప్పారు. ఉత్తమ ఫలితాలకు కృషి చేసిన పాఠశాలల ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

టెన్త్‌లో అదరగొట్టారు

- పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ
- ఉత్తమ మార్కులతో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- జగన్ సర్కారు సంస్కరణలతో పెరిగిన ఉత్తీర్ణతా శాతం





బి.భార్గవి, 579 | డి.భార్గవి, 577 | వి.సూర్యతేజ, 557

సర్కారు బడంటే అందరికీ చిన్నచూపే. అక్కడ చదివే విద్యార్థులకు సరైన విద్యా బోధనతోపాటు కనీస సౌకర్యాలు కూడా ఉండేవి కాదని అనేవారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఏటికేడాది తగ్గేది. పేదల చదువుపై గత ప్రభుత్వాల నిర్లక్ష్యమే ఇందుకు కారణం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఈ పరిస్థితిని మార్చాలని కంకణం కట్టుకుంది. అందుకు తగ్గట్టు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ పేదరికం చదువు అడ్డుకాకూడదనే ఉన్నతాశయంతో ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను పూర్తిగా మార్చారు. మన బడి నాడు–నేడు ద్వారా సర్కారు బడులను సకల సదుపాయాలతో అద్భుతంగా తీర్చిదిద్దారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన మొదలగు పథకాలతో విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. పాఠశాలల్లో డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి ఉన్నతమైన.. నాణ్యమైన బోధనను అందిస్తున్నారు. తత్ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు.. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా.. అంతకుమించి అనేలా పరీక్షల్లో ఫలితాలు సాధిస్తున్నారు.

సీతంపేట: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తర నియోజక వర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో గతంలో కంటే మిన్నగా మంచి మార్కులతో సత్తా చాటారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

మధురానగర్ హైస్కూల్: 90 శాతం

సీతంపేట మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ 90 శాతం ఉత్తీర్ణత సాధించింది. గతేడాది 78 శాతం నమోదవగా.. ఈ ఏడాది మరో 12 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించడం విశేషం. 87 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కాగా.. 78 మంది పాస్ అయ్యారు. వీరిలో 52 మంది ఫస్ట్, 16 మంది సెకండ్, 10 మంది థర్డ్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. 17 మంది 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. బి.భార్గవి 579 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచింది. డి.భార్గవి 577, బి.సాయిలక్ష్మి 560, జె.తరణిరాణి 559, వి.సూర్యతేజ 557 మార్కులు సాధించారు. విద్యార్థులను స్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి అభినందించారు.

ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్: 81 శాతం

అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది 58.89 శాతం సాధించగా.. ఈ ఏడాది 22.11 శాతం ఉత్తీర్ణత పెరిగింది. మొత్తం 121 మంది పరీక్షలకు హాజరు కాగా.. 98 మంది పాస్ అయ్యారు. చింతపల్లి భరత్ 586 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచాడు.

ఎన్ఎంసీ హైస్కూల్: 75 శాతం

సీతమ్మధార: పీఅండ్‌టీ కాలనీ ఎన్ఎంసీ–జీవీఎంసీ హైస్కూల్ నుంచి 225 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కాగా.. 169 మంది పాస్ అయ్యారు. 75 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఉప్పాల ప్రతీక్ 580 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. 13 మందికి 500 మార్కులకు పైగా, మరో 13 మందికి 450 నుంచి 500 మధ్యలో మార్కులు వచ్చాయి. ఫస్ట్ క్లాస్‌లో 92 మంది, సెకండ్ క్లాస్‌లో 49 మంది, థర్డ్ క్లాస్‌లో 28 మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులను హెచ్‌ఎం, రాంప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించి, స్వీట్లు తినిపించారు.

మెకానిక్ కుమారుడికి 580 మార్కులు



ఉప్పాల ప్రతీక్

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తన లక్ష్యమని, ట్రిపుల్ ఐటీ చేయాలనుకుంటానని 580 మార్కులు సాధించిన ఉప్పాల ప్రతీక్ 'సాక్షి'కి తెలిపాడు. తన తండ్రి యు.నాగేంద్రబాబు బైక్ మెకానిక్‌గా, తల్లి లక్ష్మి టైలరింగ్ షాపులో పనిచేస్తున్నారని, హెచ్‌బీ కాలనీలో నివసిస్తున్నామని చెప్పాడు. తల్లిదండ్రులు కష్టపడి చదివించారని, క్లాస్ టీచర్ నాగభూషణం, ఉపాధ్యాయుల సహకారంతో మంచి మార్కులు సాధించానన్నాడు. ఇంటర్మీడియట్‌లో ఎంపీపీ చదువుతానని తెలిపాడు.



సీతమ్మధార: ఎన్ఎంసీ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు

రైల్వే న్యూకాలనీ హైస్కూల్: 72 శాతం



గంట్ల లోకేష్, 575

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ హైస్కూల్ నుంచి 68 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కాగా.. 49 మంది ఉత్తీర్ణులయ్యారు. 72 శాతం ఉత్తీర్ణతా శాతం సాధించింది. గతంలో ఎన్నడూ లేని అత్యధిక వ్యక్తిగత మార్కుల రికార్డును ఈ ఏడాది నమోదు చేశారు. గంట్ల లోకేష్ 575 మార్కులతో ఆల్‌టైం స్కూల్ టాపర్‌గా నిలిచాడు.

మాధవధార హైస్కూల్: 87 శాతం

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల నుంచి 154 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కాగా.. 134 మంది ఉత్తీర్ణులై 87 శాతం ఫలితాలు సాధించారు. గతేడాది 68 శాతం కాగా.. ఈ ఏడాది 87 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. బాలికలు 89 శాతం, బాలురు 84 శాతం ఫలితాలు సాధించారు. జి.తేజేష్ 584 మార్కులు, జి.లావణ్య 562 మార్కులు, వి.సాయిరాజేష్ 558 మార్కులు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. హెచ్‌ఎం బి.హేమలత, ఉపాధ్యాయులు అభినందించారు.

కేఎస్‌ఎం గర్ల్స్ హైస్కూల్: 95 శాతం

జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ కేఎస్‌ఎం గర్ల్స్ హైస్కూల్ నుంచి 76 మంది విదార్థినులు టెన్త్ పరీక్షలకు హాజరు కాగా.. 72 మంది ఉత్తీర్ణులయ్యారు. 95 శాతం పాస్ పర్సంటేజి నమోదైంది. ఈ స్కూల్ విద్యార్థిని రాయల భారతి 591 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలు రాసిన విద్యార్థుల్లో జిల్లా టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా భారతిని ఎంఈవో కె.బాలమణి, హెచ్‌ఎం కె.రాము, ఉపాధ్యాయులు అభినందించారు.

కె.కాలనీ హైస్కూల్: 86 శాతం



బి.నవ్యశ్రీ, 573

అల్లూరి సీతారామరాజు నగర్‌లోని కె.కాలనీ జీవీఎంసీ హైస్కూల్ నుంచి 117 మంది పరీక్షలు రాయగా.. 101 మంది ఉత్తీర్ణులై 86 శాతం ఫలితాలు సాధించారు. బి.నవ్యశ్రీ 573 మార్కులు, కె.లలితాంబిక 568 మార్కులు, ఎస్.తేజశ్రీ 554 మార్కులు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రథమ శ్రేణిలో 69 మంది, ద్వితీయ శ్రేణిలో 19, తృతీయ శ్రేణిలో 13 మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులను హెచ్‌ఎం ఎస్ఎస్ఎం సాయిలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

కప్పరాడ హైస్కూల్: 92 శాతం

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్ కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్ నుంచి 115 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా.. 106 మంది పాసై 92.17 ఉత్తీర్ణత శాతం సాధించినట్లు హెచ్‌ఎం వి.విజయమాలిని తెలిపారు. ఎస్.యోగేశ్వరి 589 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిందని చెప్పారు. 15 మంది 500 మార్కులకు పైగా సాధించారు. విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవం



సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుంటున్న కె.కె.రాజు, ధర్మకర్త దేవాల రాజు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో కార్తికేయ శరవణ ట్రస్టు ఆలయ ధర్మకర్త దేవాల రాజు(కృష్ణ) ఆధ్వర్యంలో సోమవారం చైత్రమాస బహుళ పూర్ణిమ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ నేతృత్వంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, కలశాభిషేకం, సహస్రనామ విభూది పుష్పాలతో అర్చనలు చేశారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మాలధారులు శూలాలు వేసుకుని వేల్‌వేల్ మురుగన్ అంటూ రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊర్వశి కూడలి నుంచి జాతీయ రహదారిలో కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన మీదుగా రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. జాతరలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొక్కాకుల కుమారి, కడగల జ్యోతిష్, కార్యదర్శి కాండ్రేగుల రాము, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ

చురుగ్గా నాయకుల ఎన్నికల ప్రచారం



46వ వార్డులో కె.కె.రాజును గెలిపించాలని ఓటు అభ్యర్థిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్


కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. 46వ వార్డు కైలాసపురం మధుసూదన నగర్, శాంతినగర్ కొండవాలు ప్రాంతాల్లో ఆయన సోమవారం సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును గెలిపించాలని కోరారు. కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, వార్డు సీనియర్ నాయకులు బి.గోవింద్, కె.చిన్నా, ఎన్.కృష్ణ, నర్సింగరావు, రామారావు, కె.లావణ్య, జి.అప్పారావు, కె శ్రీను, కృపా అప్పలరెడ్డి, బొట్టా రాజు, వరలక్ష్మి, దేవి, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మంచి పాలనకు ఓటేయండి

మర్రిపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన పాలనను చూసి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ కోరారు. అశోక్‌నగర్ పరిసర ప్రాంతాల్లో వార్డు నాయకులతో కలిసి సోమవారం సాయంత్రం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిలను గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు మాసిన లక్ష్మి, పప్పల సునీత, సనపల నారాయణస్వామి పాల్గొన్నారు.

మేలు చేసిన వారికి మద్దతివ్వండి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల ఎన్నో కుటుంబాలకు మేలు జరిగిందని, ఆలోచించి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. వార్డులోని మహత్ కాలనీ తదితర ప్రాంతాల్లో నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలను గెలిపించాలని ప్రజలను కోరారు. డైరెక్టర్లు పైడి శ్రీనివాసరావు, దిడ్డి రమేష్, ప్రసూనారెడ్డి, బి.తిరుమలరావు, రాజంరాజు, దమయంతి, లక్ష్మణ్, శ్యామ్, గణేష్, లత, రాణి పాల్గొన్నారు.



51వ వార్డులో కరపత్రం అందిస్తున్న రెయ్యి వెంకటరమణ తదితరులు



49వ వార్డులో కరపత్రాన్ని అందిస్తున్న అల్లు శంకరరావు




50వ వార్డులో కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న వావిలపల్లి ప్రసాద్ తదితరులు

ప్రజా సంక్షేమానికి ఓటేయండి

ఎల్లప్పుడు ప్రజల క్షేమాన్ని కోరుకునే వైఎస్సార్‌సీపీనే ప్రజలు గెలిపించుకోవాలని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు అన్నారు. మాణిక్యాంబ కాలనీ, పీఆర్ గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో నాయకులతో కలిసి ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స ఝాన్సీ, కె.కె.రాజులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటేయాలని కోరారు. డైరెక్టర్లు ఎస్.రవికుమార్, ఐ.రవికుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ముత్తంశెట్టిని గెలిపించాలని ప్రచారం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు భీమిలి నియోజకవర్గ పరిధి కొండవాలు ప్రాంతాల్లో సోమవారం డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని కోరుతూ సింహగిరి కాలనీలో ఇంటింటికీ వెళ్లి అభ్యర్థించారు. రాబోయే ఎన్నికల్లో విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని, భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కరపత్రాలు అందించి ప్రచారం చేశారు. పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, బూత్ కన్వీనర్లు లాలం శేఖర్, నాయకులు కారుకొండ రాజు, హరి పట్నాయక్, సురేష్, సింగంపల్లి రామారావు, నేపాల్ శ్రీను, లాలం శ్రీను, దుర్గ, గౌరీశంకర్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సింహగిరి కాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు, పైడి రమణ

'ఉత్తర'ను అభివృద్ధి పథంలో నడిపిస్తా..

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- ఎన్నికల ప్రచారంలో మహిళల బ్రహ్మరథం



కె.కె.రాజును ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు



26వ వార్డు రామకృష్ణానగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సోమవారం సాయంత్రం 26వ వార్డు రామకృష్ణానగర్, చిన్నూరు, బోరావారి వీధి, లలితానగర్, చాకలిపేట, 80 ఫీట్ రోడ్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా రామలింగేశ్వరాలయంలో పూజలు చేసి, అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. స్థానిక యువత అడుగడుగునా ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో వార్డులో చాలా సార్లు పర్యటించానని, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించానని తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా ఐదేళ్లలో వార్డులో సుమారు రూ.18 కోట్లు వెచ్చించి బీటీ, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, కల్వర్టులు, స్కూళ్లు, ఆస్పత్రులు, సామాజిక భవనాలు, పార్కు, ఓపెన్ జిమ్ నిర్మించినట్లు చెప్పారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం

వార్డులో ప్రధానంగా ఉన్న వేసవిలో విద్యుత్ సరఫరా సమస్య పరిష్కారానికి సుమారు రూ.10 కోట్లతో అక్కయ్యపాలెం హైవేపై గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో కంటైనర్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశామని కె.కె.రాజు తెలిపారు. వారంలో కొత్త సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా ప్రారంభమవుతుందన్నారు. ఈ సబ్ స్టేషన్ వల్ల 26వ వార్డులో సుమారు 8 వేల విద్యుత్ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా..

తనతోపాటు 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన వ్యక్తి నాటి నుంచి ప్రజలకు కనిపించకుండా మొహం చాటేశారని, మళ్లీ ఎన్నికలు దగ్గర పడేసరికి ఓటు వేయమని వస్తున్నారని కె.కె.రాజు విమర్శించారు. ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటూ, మీ సమస్యలను పరిష్కరించే, పిలిస్తే పలికే నాయకుడికి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, వార్డు ఎన్నికల పరిశీలకుడు జి.వి.రవిరాజు, జేసీఎస్ కన్వీనర్ బులుసు జగదీష్, బొడ్డేటి కిరణ్, పాండవ శ్రీను, శేషు, హరికృష్ణ, అమ్మాజి, దేముడు, రాము, రవిబాబు, నవాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

జగన్‌తోనే ప్రజా సంక్షేమం

కంచరపాలెం: ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరి హృదయాల్లో సంక్షేమ సారథిగా సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 54వ వార్డు ఐటీఐ జంక్షన్ పరిధి సిద్ధార్థనగర్, గౌతమీ గార్డెన్స్, జ్యోతినగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు చల్లా రజనీ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి నివాసులను, పలువురు వ్యాపారులను ఆత్మీయంగా పలకరించి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రామ రాజ్యం కావాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు జగనన్న బాసటగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఏకపక్షంగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరార. నియోజకవర్గంలో సుమారు రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, 54, 55 వార్డుల ఎన్నికల పరిశీలకుడు బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, కె.చిరంజీవి, అమర్‌రెడ్డి, నమ్మి శంకర్, రాంబాబు, రమణమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.



54వ వార్డు సిద్ధార్థనగర్‌లో కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న కె.కె.రాజు

25వ వార్డులో ఇంటింటా ప్రచారం

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రెల్లి వీధి, బీటీఆర్ కాలనీల్లో చురుగ్గా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వార్డులో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిన కె.కె.రాజును ఉత్తర ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీలక్ష్మిని విశాఖ ఎంపీగా గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మురళీకృష్ణారెడ్డి, కమ్మిల నవీన్‌కుమార్ రాజు, బుజ్జి, సచివాలయం కన్వీనర్లు బొమ్మాళి రవి, హరికృష్ణ, శేఖర్, జయ, గోవిందమ్మ, సన్నీ, గౌరినాయుడు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, గృహసారథులు, మహిళలు పాల్గొన్నారు.

ఎల్‌అండ్‌టీతో బుల్లయ్య కళాశాల ఎంవోయూ



ఎంవోయూ పత్రాలను అందుకుంటున్న ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి, ఎల్‌అండ్‌టీ బిజినెస్ హెడ్ ఫెబిన్

సీతంపేట: ఇంజినీరింగ్ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు పెంచేలా డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల సోమవారం ఎల్‌అండ్‌టీ ఎడ్యూటెక్‌తో ఎంవోయూ చేసుకుంది. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ సమక్షంలో ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దీపక్ చౌదరి, ఎల్‌అండ్‌టీ ఎడ్యూటెక్ కాలేజ్ కనెక్ట్ బిజినెస్ హెడ్ ఎం.ఎఫ్.ఫెబిన్ ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా దీపక్ చౌదరి మాట్లాడుతూ ఎల్‌అండ్‌టీ ఎడ్యూటెక్‌తో కలిసి ఫస్ట్, సెకండియర్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం కాలేజ్ కనెక్ట్ ప్రోగ్రాం, థర్డ్, ఫోర్తియర్ విద్యార్థులకు ఎంప్లాయిబిలిటీ, స్కిల్లింగ్ ప్రోగ్రాం ఇంటిగ్రేటెడ్ కోర్సుగా క్యాంపస్‌లో ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. మధుకుమార్ మాట్లాడుతూ ఎల్‌అండ్‌టీ కంపెనీ అందిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలన్నారు. ఫెబిన్ మాట్లాడుతూ ఎల్‌అండ్‌టీ గ్రూప్ ఆఫ్ కంపెనీ బాగా గుర్తింపు పొందిన భారీ ఇంజినీరింగ్, నిర్మాణం, రియాల్టీ, క్యాపిటల్ గూడ్స్ తయారీ, ఐటీ రంగాల్లో ఉద్యోగావకాశాలకు అవసరమైన స్కిల్స్, టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. తద్వారా ఎల్‌అండ్‌టీ లేదా ఏ ఇతర కంపెనీలోనైనా ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు. ఎల్‌అండ్‌టీ ఎడ్యుటెక్ రీజనల్ మేనేజర్ మయాంక్ రంజన్, కళాశాల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.